**ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం**

**విశాఖపట్నం కేంద్రం**

**జాతీయ వార్తలు**

తేదీ: 24-05-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

**ముఖ్యాంశాలు**

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తే ఎటువంటి లక్ష్యమైనా సాధ్యమవుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.
- ఆపరేషన్ సిందూర్ నేపధ్యంలో ఏర్పడిన అఖిలపక్ష ప్రతినిధి బృందాలు పలు దేశాలలో పర్యటిస్తున్నాయి.
- దేశం 2047 నాటికి వికశిత్ భారత్ గా అవతరించేందుకు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ఈరోజు సమావేశం జరిగిందని నీతి ఆయోగ్ సీఈఓ బి.వి.ఆర్ సుబ్రహ్మణ్యం తెలిపారు.
- కేరళలో ఈరోజు రుతుపవనాలు ప్రవేశించాయని భారత వాతావరణ శాఖ ప్రకటించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తే ఎటువంటి లక్ష్యమైనా సాధ్యమవుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ప్రధానమంత్రి అధ్యక్షతన నీతిఆయోగ్ పదవ పాలకమండలి సమావేశం ఈ రోజు న్యూఢిల్లీలో జరిగింది. 2047 నాటికి వికసిత్ భారత్ గా అవతరించేందుకు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలనే ఇతివృత్తంతో ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాట్లాడుతూ... వికసిత్ భారత్ 140 కోట్ల మంది భారతీయుల ఆకాంక్ష అని, దేశంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో పనిచేయాలని రాష్ట్రాలకు సూచించారు. ఆ దిశగా పనిచేస్తే వికసిత్ భారత్ లక్ష్యం చేరుకోవడానికి 2047 వరకు ఆగాల్సిన అవసరం ఉండదని ప్రధానమంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో అన్ని సదుపాయాలు, మౌలిక వసతులతో ప్రతీ రాష్ట్రంలో ఒక పర్యాటక కేంద్రాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. దేశంలో పట్టణీకరణ వేగంగా జరుగుతోందని, భవిష్యత్తు నగరాల దిశగా దృష్టి సారించాలన్నారు. మానవ వనరుల్లో మహిళలను చేర్చే దిశగా పనిచేయాల్సిన అవసరం ఉందని, మహిళలు గౌరవంగా పనిచేసేలా.. చట్టాలను రూపొందించాలని పేర్కొన్నారు.
న్యూస్ ఆన్ ఎయిర్

---

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశం 2047 నాటికి వికసిత్ భారత్ గా అవతరించేందుకు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ఈరోజు సమావేశం జరిగిందని నీతిఅయోగ్ సిఈఓ బివిఆర్ సుబ్రమణ్యం తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన ఈరోజు జరిగిన నీతిఆయోగ్ పదవ పాలకమండలి వివరాలను ఆయన పాత్రికేయులకు వెల్లడిస్తూ...

(వాయిస్ బైట్.. 40 సెకన్లు)

---

పహల్గామ్ ఉగ్రవాద దాడికి పాల్పడిన ఉగ్రవాద సంస్థను ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో పాకిస్తాన్ రక్షించిందని, రష్యాలో అఖిలపక్ష ప్రతినిధి బృందానికి నేతృత్వం వహించిన డీఎంకే పార్టీ పార్లమెంటు సభ్యులు

కనిమొళి అన్నారు. ఈరోజు మాస్కోలోని భారత రాయబార కార్యాలయంలో సంయుక్త పాత్రికేయుల సమావేశంలో కనిమొళి మాట్లాడుతూ.. పహల్గామ్ ఉగ్రవాద దాడి పాకిస్తాన్ నుండి భారత భూభాగంలోకి చొరబడిన ఉగ్రవాదులచే జరిగిందని అన్నారు. అయితే భారత్ మాత్రం బాధ్యతాయుతంగా స్పందించిందని, పౌరులపై ఈ ప్రభావం లేకుండా, సైనిక స్థావరాలు దాడికి గురికాకుండా చూసుకుందని స్పష్టం చేశారు. భారతదేశం యొక్క వైఖరిని వివరించేందుకు ప్రతినిధి బృందానికి గొప్ప అవకాశం లభించిందని ఎంపి కనిమొళి అన్నారు. ఇదిలా ఉండగా.. బిజెపి ఎంపి బైజయంత్ పాండా నేతృత్వంలోని మరో ఉన్నత స్థాయి అఖిలపక్ష ప్రతినిధి బృందం ఈరోజు బహ్రెయిన్ చేరుకుంది. అలాగే.. కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం కూడా ఐదు దేశాల పర్యటన కోసం ఈరోజు తెల్లవారుజామున ఢిల్లీ నుండి బయలుదేరింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం దశాబ్దాలుగా సరిహద్దుల వెంబడి పాకిస్తాన్ ప్రాయోజిత ఉగ్రవాద దాడులను ఎదుర్కొందని ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి, రాయబారి పర్వతనేని హరీష్ పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో ఈరోజు ఆయన మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్‌లో మరణించిన ప్రముఖ ఉగ్రవాదుల అంత్యక్రియలకు సీనియర్ సైనికాధికారులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు నివాళి అర్పించడాన్ని ప్రపంచం ఇటీవలే చూసిందన్నారు. ఉగ్రవాదులు, దేశ పౌరుల మధ్య ఎటువంటి తేడాను చూపని దేశానికి పౌరులను రక్షించడం గురించి మాట్లాడే అర్హత లేదని పర్వతనేని హరీష్ పేర్కొంటూ...

(వాయిస్ బైట్.. 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అంతర్జాతీయ యోగా దినోత్సవం 2025 వేడుకలకు ముందు జూన్ 15 నుండి 21 వరకు లడఖ్‌లో అతిపెద్ద అంతర్జాతీయ యోగా ధ్యాన ఉత్సవం పేరుతో వారం రోజుల యోగా ఉత్సవాన్ని నిర్వహించనున్నామని లడఖ్ ప్రభుత్వం ప్రకటించింది. పాంగోంగ్ సరస్సు, శాంతి స్థూపం, సింధు ఘాట్, నుబ్రా లోయతో సహా లడఖ్‌లోని ఏడు సుందరమైన ప్రదేశాలను ఈ యోగా ఉత్సవాల కోసం ఎంపిక చేశారు. దేశంలోనే ఎత్తైన ఫుట్‌బాల్ స్టేడియంగా ప్రసిద్ధి చెందిన ఆస్ట్రో టర్ఫ్ స్టేడియంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలతో ఈ ఉత్సవాలు ముగుస్తాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సహాయ మంత్రి అనుప్రియ పటేల్

ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం.. రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తుందని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన రైజింగ్ నార్త్ ఈస్ట్ పెట్టుబడిదారుల సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఈశాన్య ప్రాంతం మొత్తంలో ఆరోగ్య సంరక్షణ పురోగతిలో ప్రైవేట్ రంగం కీలక పాత్ర పోషించగలదన్నారు. ఆరోగ్య రంగంలో భారతదేశం అత్యంత వేగంగా దూసుకుపోతున్నదని సహాయ మంత్రి అనుప్రియ పటేల్ తెలియజేస్తూ..

(వాయిస్ బైట్..40 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం అంతటా సుమారు లక్ష మంది విద్యార్థులకు ఉచితంగా కృత్రిమ మేధ పై శిక్షణ, మూల్యాంకనం అందించనున్నామని కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి తెలిపారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన రైజింగ్ నార్త్ ఈస్ట్ పెట్టుబడిదారుల సదస్సులో ఆయన మాట్లాడుతూ.. సంసిద్ధత కోసం నైపుణ్యం -కృత్రిమ మేధ కార్యక్రమం కింద, మాడ్యూల్స్ రూపొందించబడ్డాయని త్వరలో 6 నుండి 12 తరగతుల మధ్య విద్యార్థుల కోసం అందుబాటులోకి వస్తాయని ఆయన వెల్లడించారు. ఎంబెడెడ్ అప్రెంటిస్ డిగ్రీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని, ఈ మేరకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఇప్పటికే మార్గదర్శకాలను జారీ చేసిందని మంత్రి జయంత్ చౌదరి వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ – మనసులోని మాట" కార్యక్రమం 122వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారం కానుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జమ్మూ కాశ్మీర్, దోడా జిల్లాలోని భదేర్వాలో కొన్ని ప్రాంతాల్లో ప్రజా శాంతికి భంగం కలిగించేందుకు "జాతి వ్యతిరేక శక్తులు" ప్రయత్నించే అవకాశం ఉన్నందున ప్రభుత్వం మే 27 వరకు మొబైల్ ఇంటర్నెట్ సేవలను తాత్కాలికంగా నిలిపివేయాలని హోం శాఖ ఆదేశించింది. దీంతో ఈ నెల 22వ తేదీ రాత్రి 8 గంటల నుండి 27వ తేదీ రాత్రి 8 గంటల వరకు సేవలను నిలిపివేశామని ఈ ఉత్తర్వులో హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చంద్రకర్ భారతి పేర్కొన్నారు. "2G/3G/4G/5G పబ్లిక్ Wi-Fi వంటి మొబైల్ డేటా సేవలను దేశ వ్యతిరేక శక్తులు, దుష్ప్రవర్తనదారులు దుర్వినియోగం చేసే అవకాశం ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నామని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జూన్ నుంచి భారత పురుషుల క్రికెట్ జట్టు ఇంగ్లాండ్ పర్యటన నేపధ్యంలో బీసీసీఐ భారత జట్టును ప్రకటించింది. కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్, వైస్ కెప్టెన్‌గా రిషభ్ పంత్‌ను ఎంపిక చేసి, మొత్తం 18 మంది ఆటగాళ్లతో జట్టును వెల్లడించింది. జూన్ 20 నుంచి ఇంగ్లాండ్‌తో ఐదు మ్యాచ్ ల టెస్టు సిరీస్ ప్రారంభం కానుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేరళలో ఈరోజు రుతుపవనాలు ప్రవేశించాయని భారత వాతావరణ శాఖ ప్రకటించింది. 2009 తర్వాత రాష్ట్రంలో రుతుపవనాలు ముందుగానే రావడం ఇదే మొదటిసారి. దీంతో కేరళ అంతటా భారీ వర్షాలు కొనసాగుతున్నాయి. ఈరోజు కన్నూర్ కాసరగోడ్ జిల్లాల్లో తీవ్ర ప్రమాద హెచ్చరికలు జారీ చేయడంతో పాటు మరో 9 జిల్లాలను ఆరెంజ్ అలర్ట్, 3 జిల్లాలు అలాగే లక్షద్వీప్ ను కూడా అప్రమత్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =